సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ఉపాధి కోసం వెళ్లి.. 8లో

కాకినాడ జిల్లాలో జరిగిన ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ఐదుగురు గిరిజనులు మృతి చెందిన వార్త ఏజెన్సీలో విషాదం నింపింది.



భారతీయం.. ఆదర్శనీయం

అమెరికన్ ప్రొఫెసర్ చార్లెస్ నుకోల్స్ గిరిజన గ్రామాల్లో పర్యటించారు. వారి జీవన విధానం గురించి తెలుసుకొని ముగ్ధులయ్యారు. 8లో

టెస్టుల్లో మన భరత్



విశాఖ స్పోర్ట్స్: విశాఖ వాసి, ఆంధ్ర రంజీ ప్లేయర్ కోన శ్రీకర్ భరత్ ప్రతిష్టాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ 2023 సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ గాయం కారణంగా వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం దక్కింది.

న్యూస్‌రీల్

దేవరాపల్లి పీహెచ్‌సీ నూతన భవనానికి రూ.1.70 కోట్లు

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



దేవరాపల్లి: రాష్ట్రంలో మూడు ప్రభుత్వ ఆస్పత్రుల నూతన భవనాల నిర్మాణానికి రూ.7.44 కోట్లు మంజూరయ్యాయని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. తారువలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద ఈ నిధులు కేటాయించారని చెప్పారు. అందులో దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నూతన భవన నిర్మాణానికి రూ. కోటి 70 లక్షలు మంజూరు చేశారన్నారు. దేవరాపల్లి పీహెచ్‌సీకి అదనపు భవన సముదాయానికి నిధులు మంజూరు చేయాలన్న తన విజ్ఞప్తిని మన్నించి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబులకు ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

అనకాపల్లి టౌన్: స్థానిక న్యాయసముదాయంలో శుక్రవారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా అదనపు న్యాయమూర్తి ఎస్.ఎం.ఫణికుమార్ గురువారం పేర్కొన్నారు. జిల్లాలో గల వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ వేదిగా మారబోతోందని ఆయన తెలిపారు. అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయనగరం జేఎన్టీయూ వీసీగా వెంకట సుబ్బయ్య




ఏయూక్యాంపస్: జేఎన్టీయూ గురజాడ విజయనగరం విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు కె.వెంకట సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్టీయూ విజయనగరం విశ్వవిద్యాలయం తొలి వీసీగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆచార్య వెంకట సుబ్బయ్య ఏయూ నుంచి బి.ఈ మెకానికల్ ఇంజినీరింగ్, ఎం.ఈ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో, పీహెచ్‌డీ మెకానికల్ ఇంజినీరింగ్‌లో పూర్తి చేశారు. 1986లో ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 2006 నుంచి ప్రొఫెసర్‌గా 2018 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 2014లో ఆచార్య వెంకట సుబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును అందుకున్నారు. అదే ఏడాది ఏయూ నుంచి బెస్ట్ రీసెర్చర్ అవార్డును స్వీకరించారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అందించే భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డును సైతం సాధించారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ప్రారంభం నేడు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): అందమైన విశాఖ సముద్ర తీరాన్ని సందర్శించేందుకు రోజూ వేల సంఖ్యలో టూరిస్ట్‌లు వస్తుంటారు. వారికి మరింత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఆర్కే బీచ్ వద్ద టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులు ప్రారంభించనున్నారు. ఈ స్టేషన్‌లో పర్యాటకులకు భద్రత కల్పించడంతోపాటు సహాయ సహకారాలను అందించనున్నారు.

మత్స్యకారులకు సిరులు



ఫిషింగ్ హార్బర్‌లో కొమ్ముకోనం, సార చేపలను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

మహారాణిపేట : మత్స్యకారులకు చేపలు పుష్కలంగా దొరుకుతున్నాయి. వలలకు భారీ సంఖ్యలో కొమ్ముకోనం, సార చేపలు చిక్కాయి. గురువారం వాటిని ఫిషింగ్ హార్బర్‌కు తీసుకొచ్చారు. అందులో దాదాపు 60 కిలోల నుంచి 150 కిలోల వరకు కొమ్ముకోనం, సార చేపలు ఉండటంతో మత్స్యకారులు సంతోషించారు. వలకు భారీ కొమ్ముకోనం, సార, ఇతర చేపలు చిక్కడంతో వాటిని ఒడ్డుకు చేర్చేందుకు మత్స్యకారులు ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యారు. చేపలను బోటులోకి ఎక్కించి ఫిషింగ్ హార్బర్‌కు తీసుకొని వచ్చారు. అతి కష్టం మీద జెట్టీలో ఒడ్డుకు చేర్చారు. పెద్ద చేపలను ముక్కలుగా కట్ చేశారు. కొమ్ముకోనం చేపలకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంది. 8 నుంచి 15 అడుగుల వరకు ఉండే వీటిని కేరళవాసులు ఇష్టంగా తింటారు. మంచి ధర పలికే ఈ చేపలు ఫిషింగ్ హార్బర్‌లో దర్శనమిస్తున్నాయి.



ఎన్నికల నగారా

పట్టభద్రుల పోరుకు రంగం సిద్ధం

- 16న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- ఉత్తరాంధ్రలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- ఉత్తరాంధ్రలో 2,82,348 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- 338 పోలింగ్ స్టేషన్లు, 694 బ్యాలెట్ బాక్సులు
- 6 జిల్లాల్లో 1,860 మంది పోలింగ్ అధికారులు



ఓటరు జాబితా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మరోవైపు టీడీపీ చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో నేతల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గురువారం నుంచే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ప్రకటించారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్వోలు వ్యవహరించనున్నారు. బ్యాలెట్ బాక్సులు ఎన్ని ఉన్నాయి.? పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, సున్నితమైన పోలీస్ స్టేషన్లు, ఓటరు జాబితాలు, పోలింగ్ స్టేషన్‌ల్లో సిబ్బంది, అధికారుల కేటాయింపు తదితర అంశాలపై తలమునకలవుతున్నారు. కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

రాజుకున్న రాజకీయ వేడి

ఈసారి రాజకీయపక్షాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ముందుగానే దృష్టిసారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ని ప్రకటించగా.. ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభని ఎంపిక చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మాత్రం చిన్నికుమారి లక్ష్మిని పక్కన పెట్టి డా. చిరంజీవిరావు తమ ఎమ్మెల్సీ అభ్యర్థి అంటూ తెరపైకి తీసుకొచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

అప్పుడు 1.70 లక్షలు.. ఇప్పుడు 2.82 లక్షల ఓటర్లు

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈసారి 2.82 లక్షలకు పైగా ఓటర్లు నమోదైన తరుణంలో పోలింగ్ శాతం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

నోటిఫికేషన్ వివరాలివీ..

షెడ్యూల్ విడుదల : ఈనెల 16
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం : ఈనెల 16
నామినేషన్ల ముగింపు : ఈనెల 23
నామినేషన్ల పరిశీలన : ఈనెల 24
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : ఈనెల 27
పోలింగ్ తేదీ : మార్చి 13 ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
కౌంటింగ్ తేదీ : మార్చి 16
ఎన్నికల కోడ్ ముగిసే తేదీ : మార్చి 21

పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	సహాయక స్టేషన్లు	మొత్తం పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	57	02	59
విజయనగరం	64	06	70
పార్వతీపురం మన్యం	24	00	24
అల్లూరి సీతారామరాజు	14	01	15
విశాఖపట్నం	94	28	122
అనకాపల్లి	44	04	48
మొత్తం	297	41	338

జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	ఓటర్లు	పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
శ్రీకాకుళం	51,025	136
విజయనగరం	57,568	536
పార్వతీపురం మన్యం	18,307	188
అల్లూరి సీతారామరాజు	11,350	346
విశాఖపట్నం	1,03,243	2662
అనకాపల్లి	40,855	869
మొత్తం	2,82,348	4,737

అవసరమైన బ్యాలెట్ బాక్సులు

జిల్లా	500 ఓట్ల బాక్సులు	రిజర్వ్	ఇతర బాక్సులు	మొత్తం బాక్సులు
శ్రీకాకుళం	103	21	00	124
విజయనగరం	116	23	00	139
పార్వతీపురం మన్యం	37	07	00	44
అల్లూరి సీతారామరాజు	23	05	02	30
విశాఖపట్నం	207	41	08	256
అనకాపల్లి	82	16	03	101
మొత్తం	568	113	13	694

పోలింగ్ అధికారుల వివరాలు

జిల్లా	పీవో	ఏపీవో	ఓపీవో	రిజర్వ్	మొత్తం	మానిటరింగ్ అధికారి
శ్రీకాకుళం	59	59	177	30	325	59
విజయనగరం	70	70	210	35	385	70
పార్వతీపురం	24	24	72	12	132	24
అల్లూరి	15	15	45	08	83	15
విశాఖపట్నం	122	122	366	61	671	122
అనకాపల్లి	48	48	144	24	264	48
మొత్తం	338	338	1014	170	1860	338

ఈ క్రాప్ నమోదుకు గడువు ఈ నెల 20

- ఈలోగా ఈకేవైసీ పూర్తి కావాలి
- ఆధార్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానంతోనే పీఎం కిసాన్ సొమ్ము
- జిల్లాలో 20 వేల టన్నుల ధాన్యం కొనుగోలు
- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



దేవరాపల్లిలో రబీ పంటల నమోదుపై రైతును ఆరా తీస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: రబీ పంటల నమోదు (ఈ క్రాప్)కు ఈ నెల 20వ తేదీతో గడువు పూర్తవుతుందని, ఈలోగా రైతులంతా పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు చెప్పారు. గురువారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. దేవరాపల్లి, నాగయ్యపేట, కాశీపురం, వేచలం గ్రామాల్లో పర్యటించి రైతు భరోసా కేంద్రాలతోపాటు క్షేత్ర స్థాయిలో రబీ పంటల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. పంటల పరిస్థితిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 38 వేల ఎకరాల్లో రబీ పంటలు సాగు చేశారని, వీటిలో 35 వేల ఎకరాలకు పంట నమోదు జరిగిందన్నారు. పంటల నమోదు చేసుకున్న రైతులంతా స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీని (వేలి ముద్రలు) ఈ నెల 20 లోగా పూర్తి చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు ఆధార్ నంబర్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం శ్రీకాని వారు తక్షణమే చేయించుకోవాలన్నారు. ఈనెల 10న పీఎం కిసాన్ సొమ్ము జమ అవుతుందన్నారు.

రాయితీపై యంత్రపరికరాలు

జిల్లాలో ఇప్పటి వరకు యంత్రపరికరాలు తీసుకోని 179 సీహెచ్‌సీ గ్రూపులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో రాయితీపై యంత్రపరికరాలు అందజేస్తామన్నారు. సదరు గ్రూపు సభ్యులంతా ఈ నెల 10లోగా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, మార్చి మొదటి వారంలో రూ.15 లక్షలు విలువ చేసే యంత్రపరికరాలు, పనిముట్లు అందజేస్తారన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 32 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 20 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. మిగిలిన రైతులు త్వరగా ఆర్బీకేల్లో విక్రయించాలని ఆయన సూచించారు. జిల్లాలో 138 విలేజ్ హార్టికల్చర్ (వీహెచ్‌ఏ), 28 విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

మేలు చేసేవారిని మర్చిపోవద్దు

- సినీ నటుడు సుమన్



హీరో సుమన్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్త బాల సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి రావాలని అనుకున్నప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.. ఎంజీ రామచంద్రన్, ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చే సమయంలో ఆ రాజకీయాలు వేరు.. ఇపుడు ఆ పరిస్థితులు లేవని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. సినిమా నటులు ఒకరినొకరు తిట్టుకోవడం, చాలా అసహ్యంగా మాట్లాడుకోవడం తరచూ చూస్తున్నామని, అటువంటి వాటికి తాను దూరమన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణలో కేసీఆర్‌కు తాను మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఎవరివల్ల మీరు బాగుపడుతున్నారో... ఎవరి వల్ల సంతోషంగా ఉన్నారో వారిని మర్చిపోవద్దని ఈ సందర్భంగా సూచించారు. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గొల్లపేటలో వెలసిన నర్సింగబిల్ల అమ్మవారిని హీరో సుమన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. స్వర్ణభారతి స్టేడియంలో కరాటే టోర్నీకి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు వచ్చానని తెలిపారు. ఇప్పటి వరకు తెలుగులో 100 సినిమాలు పూర్తి చేశానని, అన్ని భాషల్లో 700 సినిమాల్లో నటించానని సుమన్ వివరించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

కొమ్మాది (భీమిలి): జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు. వాస్తవానికి ఈ నెల 8వ తేదీతో గడువు ముగిసిందన్నారు. అయితే విద్యార్థులకు మరో అవకాశం ఇచ్చేందుకు గడువు తేదీని పొడిగించినట్టు సంజయ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నవోదయ వెబ్‌సైట్ www.nvs.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా అభ్యర్థులు కేటగిరి, ప్రాంతం, మీడియం, అంగవైకల్యం వంటి విషయాల్లో సవరణలు చేసుకునేందుకు 16, 17 తేదీల్లో వెబ్ సైట్‌లో అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు.

మనసారా.. ఘన సారె..

- వేడుకగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి నివేదించిన పిండివంటలు, (ఇన్‌సెట్) అమ్మవారి సారె ఊరేగిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్: అమ్మవారికి భక్తులు నివేదించిన పిండివంటలు కనువిందు చేశాయి. వారి భక్తిభావాన్ని ప్రతిఫలించాయి. స్థానిక విజయరామరాజుపేట శ్రీమరిడిమాంబ అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు పరిసర ప్రాంతాల మహిళలు బూరెలు, అరిసెలు, చలిమిడి, గారెలు, లడ్డూ, జంతికలు, సున్నుండలు తదితర సంప్రదాయ పిండి వంటలను తయారు చేసి, వాటిని పళ్లేల్లో తలకెత్తుకుని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామసత్యనారాయణ, కార్యదర్శి పలకా రాము, ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ట బుద్ధేశ్వరరావు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

దశాబ్దం కల.. నెరవేరుతున్న వేళ

- నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు కసరత్తు
- రూ.16.60 కోట్లతో 100 అడుగుల వెడల్పున రోడ్డు



విస్తరించనున్న మెయిన్ రోడ్డు

నర్సీపట్నం : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం మున్సిపాలిటీలో మెయిన్ రోడ్డు విస్తరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. దశాబ్దం నాటి రోడ్డు విస్తరణ ప్రక్రియ ఎట్టకేలకు పట్టాలెక్కింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఉదయం, సాయంత్రం పూట నడిచేందుక్కూడా తావులేని పరిస్థితి. దశాబ్దంగా రోడ్డు విస్తరణ కోసం స్థానికులు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి అయ్యన్న శుష్కవాగ్దానాలు తప్ప, చేసిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికుల నిరీక్షణకు తెరపడుతోంది.

ఎమ్మెల్యే అడిగారు.. సీఎం నిధులిచ్చారు

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు దశాబ్ద కాలంగా చేస్తున్న రోడ్డు విస్తరణ ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. గాలి మాటలుగానే నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రోడ్డు విస్తరణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం జగన్ వెంటనే విస్తరణ పనులకు రూ.16.60 కోట్లు మంజూరు చేయించారు. గతేడాది డిసెంబర్‌లో నర్సీపట్నం విచ్చేసిన ముఖ్యమంత్రి స్వయంగా రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో మున్సిపల్, రెవెన్యూ, అర్అండ్‌బీ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే 100 అడుగుల మేర రోడ్డును వెడల్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. నిధులు సైతం మంజూరు కావడంతో విస్తరణ పనులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేపట్టారు.

ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్

పరిసర మండలాలకు చెందిన ప్రజలు నిత్యావసరాలు, ఆస్పత్రులు, విద్య, ఇతర వ్యాపార లావాదేవీలు నర్సీపట్నం కేంద్రంగా నిర్వహిస్తుంటారు. మెయిన్ రోడ్డు చిన్నదిగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మెయిన్‌రోడ్డుపై నడిచేందుకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అబిద్ సెంటర్‌కు రావాలంటే ద్విచక్ర వాహనదారులకు సైతం అరగంటకు పైనే సమయం పడుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 100 అడుగుల మేర రోడ్డును వెడల్పు చేస్తున్నారు. విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇక్కట్లకు శాశ్వత పరిష్కారం దక్కినట్టే.

1.5 కి.మీ... రూ.16.60 కోట్లు

అబిద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1.5 కి.మీ. మేర మెయిన్ రోడ్డును విస్తరించనున్నారు. రూ.16.60 కోట్ల వ్యయంతో 100 అడుగుల వెడల్పుతో విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. మున్సిపల్ ప్లానింగ్ అధికారులు రోడ్డు విస్తరణలో నష్టపోయే ఇళ్లు, దుకాణాలు, ఖాళీ స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. రోడ్డు విస్తరణ వల్ల నష్టపోయే బాధితులకు అక్కడ మార్కెట్ విలువను బట్టి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మార్కింగ్ ఇచ్చిన వెంటనే పనులు



రోడ్డు విస్తరణకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. ఎవరికీ ఇబ్బంది తలెత్తకుండా పక్కా ప్రణాళికతో రోడ్డు విస్తరణ చేపడుతున్నాం. ప్లానింగ్ సిబ్బంది రోడ్డు విస్తరణ వల్ల తొలగించాల్సిన భవనాలు, కోల్పోయే స్థలాలను లెక్కిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే సెంటర్ మార్కింగ్ ఇచ్చి విస్తరణ పనులు చేపడతాం. ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులకు ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా నాలుగు రెట్లు విలువ గల టీడీఆర్ బాండ్లు ఇస్తాం.

– కె.కనకారావు, మున్సిపల్ కమిషనర్

ఉరకలెత్తిన ఉత్సాహం

- ఉత్కంఠభరితంగా ఎడ్ల బళ్ల పోటీలు



ఏఎస్ పేటలో ఎడ్ల పరుగు పందాలు

కశింకోట: అమీన్‌సాహెబ్‌పేట (ఏఎస్ పేట)లో గురువారం సాయంత్రం ఉభయ జిల్లాల స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరై తిలకించారు. అభయాంజనేయస్వామి తీర్థం పురస్కరించుకొని పోటీలు నిర్వహించారు. వెంపాడు, కస్పా జగన్నాథపురం, చుక్కపల్లి తదితర గ్రామాలకు చెందిన ఎడ్ల బళ్ల నిర్వాహకులకు బహుమతులు లభించాయి. ఈ మేరకు నగదు పారితోషికాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మలసాల కుమార్‌రాజా అందజేశారు. 11 ఎడ్ల బళ్లు పోటీలో పాల్గొన్నాయి.

ఉపాధి కోసం వెళ్లి.. ఊపిరి వదిలి..



రోదిస్తున్న మృతుడు నర్సింగరావు భార్య పారతమ్మ

కుటుంబ పోషణ నిమిత్తం ఉపాధి కోసం వెళ్లిన వారిలో ఐదుగురి ప్రాణాలను విధి పొట్టన పెట్టుకుంది. ఆయా కుటుంబాలకు దిక్కులేని వారిని చేసింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని ఆయిల్ ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదం పెదబయలు మండలంలో విషాదం నింపింది. పోషించే దిక్కు కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రమాద ఘటనతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. సహాయక చర్యలు చేపట్టింది.

సాక్షి,పాడేరు/పెదబయలు/కొయ్యూరు: ఆయిల్ ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదంలో ఐదుగురు గిరిజనుల మృతితో పెదబయలు మండలంలో విషాదం నెలకొంది. ఇదే మండలంలో పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెచ్చంగి నరసింగరావు (40), వెచ్చంగి కృష్ణారావు(36), వెచ్చంగి సాగర్ (23), వంచేడిపుట్టు గ్రామానికి చెందిన కుర్తాడి బొంజుబాబు(35), బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన కొర్రా రామారావు(45) ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరంతా ఫ్యాక్టరీలో ఆయిల్ ట్యాంకర్‌ను శుద్ధి చేస్తుండగా సంభవించిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అదే ఫ్యాక్టరీలో ఈ ప్రాంతానికి చెందిన మరికొంతమంది కూలీలుగా పనిచేస్తుండటంతో వారి కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి.



విషణ్ణవదనంలో మృతుల కుటుంబసభ్యులు

- కాకినాడ జిల్లా జి.రాగంపేటలోని ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ఐదుగురు గిరిజనుల మృతి
- లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో విషాదం
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు

రెండు వారాల క్రితమే..

వీరంతా సంక్రాంతి పండగకు వారం రోజుల ముందుగానే వచ్చారు. గ్రామంలో ఉంటున్న కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా గడిపారు. పండగను ఘనంగా జరుపుకున్నారు. వారు పనిచేస్తున్న ఆయిల్ ఫ్యాక్టరీకి గ్రామం నుంచి రెండు వారాల క్రితమే వెళ్లారు. పండగకు వచ్చిన కుటుంబసభ్యులు, గ్రామస్తులతో గడిపిన వారి మరణవార్త లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



జీజీహెచ్ మార్చురీ వద్ద రోదిస్తున్న బంధువులు

పోషించే దిక్కు కోల్పోయి..

ఐదుగురు గిరిజనుల మృతితో ఆయా కుటుంబాలు పోషించే దిక్కును కోల్పోయి వీధిన పడ్డాయి. ఆయిల్ ఫ్యాక్టరీలో రోజువారీ కూలీకి రూ.650 చెల్లిస్తున్నారు. దీంతో వారితో పాటు గ్రామానికి చెందిన మరికొంతమంది గిరిజనులు ఫ్యాక్టరీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారు అక్కడే ఉంటూ కూలి ద్వారా వచ్చే ఆదాయాన్ని కుటుంబసభ్యులకు పంపిస్తున్నారు. ఇలా ఎంతో సాఫీగా సాగిపోతున్న కుటుంబాల్లో ప్రమాద ఘటన తీవ్ర శోకం నింపింది. కొర్రా రామారావు మృతితో అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి దయనీయంగా మారింది. భార్య కొమాలమ్మతోపాటు సన్యాసమ్మ, లక్ష్మి, పండుబాబు, శంకర్, రాధిక, సాయి, శేఖర్, మేరి సంతానం ఉన్నారు. వీరంతా చిన్నవయసు వారే. ఐదుగురు ప్రాథమిక విద్య చదువుతున్నారు. కుటుంబ యజమాని మృతితో వారంతా గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో..

వెచ్చంగి కృష్ణారావుకు భార్య లక్ష్మితో పాటు కవిత, త్రినాథ్, వినీత, సంగీత, ప్రవీణ్ పిల్లలు ఉన్నారు. వీరంతో పదేళ్ల వయసు లోపు వారే. కుర్తాడి బొంజన్నకు భార్య నీలమ్మతో తండ్రి అర్జున్,పిల్లలు సాయి,బాలకృష్ణ,వెంకటలక్ష్మి,శ్రీవాణి ఉన్నారు. వీరు కూడా చిన్న పిల్లలే. పలు విద్యాలయాల్లో చదువుతున్నారు. వీరి చదువులు, జీవనోపాధికి పాటుపడుతున్న కుటుంబ యజమానుల మరణంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారు.

కుటుంబానికి బాసటగా ఉంటూ..

మృతుల్లో వెచ్చంగి సాగర్(23)కు వివాహం జరగలేదు. మూడవ తరగతి వరకు చదువుకున్నాడు. ఒక్కడే కావడంతో కుటుంబ బాధ్యతలన్నీ అతనిపై పడ్డాయి. ఆయిల్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తూ వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ప్రతినెలా కుటుంబానికి పంపిస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు సీతారామ్, సత్యవతి, చెల్లెళ్లు ఉన్నారు. వీరికి ఏకష్టం రాకుండా అండగా ఉంటూ కుటుంబానికి బాసటగా నిలిచాడు. సాగర్ మృతితో తమకు దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు.

రాత్రి 9గంటలకు మాట్లాడా..

మృతుడు నర్సింగరావు భార్య పారతమ్మ

బుధవారం రాత్రి 9గంటలకు భర్త నర్సింగరావుతో మాట్లాడానని, తెల్లారేసరికి దుర్వార్త వినాల్సి వచ్చిందని అతని భార్య పారతమ్మ గుండెలవిసేలా రోదించింది. అతడికి భార్యతోపాటు నలుగురు సంతానం ఉన్నారు. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన చంపాపుట్టు మత్స్యరాజుతో పంపిన రూ.2 వేలు అందుకున్నానని చెప్పానని, కొద్దిరోజుల్లో మళ్లీ డబ్బు పంపిస్తానని, జాగ్రత్తగా ఉండమని భర్త చెప్పాడని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఎన్నో కష్టాలు పడుతూ తమను పెంచుతున్న పెద్ద దిక్కును కోల్పోయామని విలపించింది. కుటుంబాన్ని ఎలా పోషించాలని ఆవేదన చెందుతోంది.

కాకినాడకు మూడు అంబులెన్సులు

ఐదుగురు గిరిజనుల మృతదేహాలను శవ పరీక్షలు అనంతరం సొంత గ్రామాలకు తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం మూడు అంబులెన్సులను గురువారం కాకినాడకు పంపింది. సహాయక కార్యక్రమాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్‌లు కాకినాడ కలెక్టర్,ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కూడా అంబులెన్సులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. దీంతో పెదబయలు, పాడేరు తహసీల్దార్లతో పాటు అంబులెన్స్‌లను అక్కడకు పంపారు.



కాకినాడ జీజీహెచ్ వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు



మార్చురీలోకి మృతదేహాన్ని తీసుకెళ్తున్న సిబ్బంది



సొమ్మసిల్లిపోయిన మృతుడి కుటుంబ సభ్యుడు

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

సాక్షి ప్రతినిధి,కాకినాడ: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు వారు..అయినవాళ్లను ఊరిలో వదిలి దూర ప్రాంతం నుంచి వచ్చినవారు కొందరైతే..దగ్గరున్న ఫ్యాక్టరీలో పనిచేసి కుటుంబాన్ని పోషించుకుందామని భావించిన వారు కొందరు.. తాము చేస్తున్న పని ఎంత ప్రమాదకరమైనదో గుర్తించలేని అమాయకులు వీరు..కనీస భద్రత లేని చోట తాము ఉపాధి పొందుతున్నా మని గ్రహించని అభాగ్యులు..ఈ పరిస్థితులే ఏడుగురి ప్రాణాలు బలిగొన్నాయి. వీరిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు ఉన్నారు. పెద్దాపురం మండలం జి. రాగంపేట వద్ద గురువారం అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ ట్యాంకర్ వద్ద జరిగిన దుర్ఘటనలో వీరు విగతజీవులైన వైనం హృదయాలను కలచి వేసింది.

కనీస భద్రత చర్యలు లేకుండా..

ఫ్యాక్టరీలో వంట నూనె ప్యాకింగ్ సెక్షన్‌లో కార్మికులకు ట్యాంకర్లను శుభ్రపరిచే అనుభవం ఎంతమాత్రం లేదు. అటువంటి కార్మికులతో ట్యాంకులను శుభ్రం చేయించడమే ఒక తప్పు. 24 అడుగులు ఎత్తున ఉండే ట్యాంకులో కార్మికులు దిగేటప్పుడు కనీస భద్రతా చర్యలు తీసుకోవాలనే ఆలోచన కూడా లేకుండా పోయింది. దీనికి నిరుపేదలు తమ ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వచ్చింది.

అసలేం జరిగింది..

ఆయిల్ ఫ్యాక్టరీలోని ట్యాంకులోపల ఆక్సిజన్ స్థాయి 20శాతం ఉండేటట్టుగా చూడాలి. ట్యాంకుపై గాలి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ట్యాంకులోకి కార్మికులు దిగేటప్పుడు కనీసం వారికి ఆక్సిజన్ మాస్కులు కల్పించడ లేదని తాజా దుర్ఘటన స్పష్టం చేస్తోంది. 24 అడుగుల లోతున్న ట్యాంకుల్లో మడ్డి తొలగించేందుకు నైపుణ్యమున్న కార్మికులను మాత్రమే వినియోగించాలి. కానీ ఇలాంటి చర్యలేవీ యాజమాన్యం తీసుకున్న దాఖలా కనిపించలేదు. సామర్లకోట వద్ద ఏఎస్ ఆయిల్స్ కంపెనీయే రాగంపేటలో నువ్వులను నూనెగా తీసి ఇదే ప్లాంట్‌లోని ట్యాంకుల్లో నిల్వ చేసి ప్యాకింగ్‌కు పంపిస్తుంది. ఈ నిల్వ ట్యాంకులకు అనుమతి ఉందా లేదా అనే దానిపై ఇప్పుడు అధికారులు విచారిస్తున్నారు. మెయిన్ ఫ్యాక్టరీకి ఉన్న అనుమతులతోనే ఇక్కడి ప్లాంట్‌లో ట్యాంకులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.



ఫ్యాక్టరీలోని ఆయిల్ ట్యాంకర్లు

మిన్నంటిన రోదనలు

రాగంపేట సంఘటన స్థలానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మరో పక్క మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

రూ.50 లక్షలతో గవరపేటకు సీసీరోడ్డు

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు భూమిపూజ

కె.కోటపాడు: సీఎం జగన్ పాలనలో అన్ని గ్రామాల్లోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని చౌడువాడలో గవరపేట సంతోషిమాత ఆలయం నుంచి జుత్తాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కిలోమీటరు మేర సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. దీంతోపాటు డ్రైనేజీ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వ్యవసాయ పంటలను ఇళ్లకు తరలించేందుకు ఇతర మార్గాల్లో చేరుకునేవారు. వీరి కష్టాలను వైఎస్సార్‌సీపీ నాయకులు డిప్యూటీ సీఎంకు వివరించారు. రోడ్డు పరిస్థితిని మూడు నెలల క్రితం పరిశీలించి నిధులను మంజూరు చేశారు. పనులు ప్రారంభించడంతో ప్రజలు కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వారాధి అప్పారావు, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, రాజి శ్రీనివాసరావు, తనకల అప్పలకోటి పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

వాలీబాల్ విజేత రాజమహేంద్రవరం జట్టు


చోడవరం రూరల్: గోవాడలో పరిదేశమ్మ అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.25 వేల బహుమతిని చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, పోటీల నిర్వాహక స్టార్మ్ బోయ్స్ అంభేరుపురం, గోవాడ గ్రామాల యూత్ సభ్యులు ప్రదానం చేశారు. మంగళవారం లాంఛనంగా ప్రారంభమైన ఈ పోటీలు గురువారంతో ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవడంతో రూ.20 వేలు, విజయనగరం జిల్లా జట్టుకు తృతీయ బహుమతిగా రూ.15 వేలు, చతుర్థ స్థానంగా విశాఖపట్నం జిల్లా జట్టుకు రూ.10 వేలు, ఐదో స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు రూ.7,500, ఆరో స్థానంలోని యానాం జట్టుకు రూ.5 వేల చొప్పున ప్రదానం చేశారు.



పోటీ పడుతున్న వాలీబాల్ జట్లు

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

చోడవరం రూరల్ : మండలంలోని రామజోగిపాలెం గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు మిర్తిపాటి త్రిమూర్తులు అనూహ్యంగా అదృశ్యమయ్యాడు. త్రిమూర్తులు అన్నయ్య సంతోష్‌కుమార్ చోడవరం పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌కుమార్‌కు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. చిన్నవాడైన త్రిమూర్తులు ఈ నెల 6న సోమవారం ఉదయం పదిగంటల సమయంలో చోడవరంలో కాంపిటీటివ్ పరీక్షలకు గైడు కొనుక్కుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే ఆరోజు రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. అతడి స్నేహితులు, బంధువులతో ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో బుధవారం చోడవరం పోలీసులను ఆశ్రయించారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 7287063272 నంబర్‌కు కాల్ చేయాల్సిందిగా కోరారు.



త్రిమూర్తులు (ఫైల్)

తెలుగుతల్లి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

- దిమిలి వాసి మృతి

అల్లిపురం (విశాఖ దక్షిణం): తెలుగుతల్లి ఫ్లైవోవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ ఎస్‌ఐ కె.విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నాగమతూరి కామేశ్వరరావు(32) సంపత్ వినాయగర్ ఆలయం నుంచి రైల్వే స్టేషన్ వైపు ద్విచక్రవాహనంపై వెళుతూ పెద్ద మర్రిచెట్టు వద్ద డివైడర్ మధ్యలో గల పూల కుండీని బలంగా ఢీకొన్నాడు. కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

భారతీయ జీవన విధానం ఆదర్శనీయం

- గిరి 'జనం'తో మమేకమైన అమెరికన్ ప్రొఫెసర్

చోడవరం రూరల్: అమెరికాలోని ప్రఖ్యాత బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ చార్లెస్ నుకోల్స్ బుధ, గురువారాలు చేపట్టిన పర్యటనలో ఇటు మైదాన ప్రజలతోనే గాకుండా గిరి'జనం'తోనూ మమేకమయ్యారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ముగ్ధుడైన నుకోల్స్ గిరిజనుల జీవన విధానాలను తెలుసుకుని మాడుగుల మండలంలోని చింతలూరు, గదబూరులలో పర్యటించారు. అక్కడ వారి సామాజిక జీవనంతో ఆధ్యాత్మిక విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, ఆచార వ్యవహారాలు, బలమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తనకు ఎన్నో కొత్త విషయాలను నేర్పించాయన్నారు. భారతీయ జీవన విధానం విలువలతో కూడిన గౌరవప్రదంగా ఉందని అభిప్రాయపడ్డారు. వృద్ధుల పట్ల, పెద్దల పట్ల చూపుతున్న ఆదరణ అమెరికా వంటి అగ్ర దేశాలకు ఆచరణీయమన్నారు. భవిష్యత్తులో అమెరికా ఎదుర్కొనే ఆర్థిక విపత్తు కారణంగా ముఖ్యంగా వృద్ధుల పట్ల నిరాదరణ, గౌరవం లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొబోతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారతీయ జీవనంతోపాటు ఆధ్యాత్మికతపై తన పరిశోధన సాగుతుందన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథ దేవాలయం విశిష్టత పట్ల ప్రధానంగా సాగుతున్నట్లు వివరించారు. చింతలూరు, గదబూరులలో గిరిజనుల సత్కారాన్ని స్వీకరించారు. విశ్రాంత ఉప కులపతి ముర్రు ముత్యాలనాయుడు అందించిన రచనలను గిరి విద్యార్థులకు పంచిపెట్టారు. ముందు రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులతో మమేకమై తన అనుభవాలను, అభిప్రాయాలను చాటి చెప్పారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల అమెరికన్ ప్రొఫెసర్ ఆకర్షితుడు కావడం పట్ల పూర్వపు వీసీ ముత్యాలనాయుడు, చోడవరం ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ కృష్ణారావు, విశ్రాంత ఆర్జేడీ తిరుపతిరావు, మాజీ లెక్చరర్ ఎస్.దేముడు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.



గిరిజనుల సత్కారం అందుకుంటున్న నుకోల్స్

రాష్ట్ర స్థాయి బయో సమ్మిట్‌లో విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట : కాకినాడలో ఈనెల 8 న నిర్వహించిన ఎకోటోన్ రాష్ట్ర స్థాయి బయో సమ్మిట్ కార్యక్రమంలో జరిగిన పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ పోటీలలో ఇంటిగ్రేటెడ్ సెరికల్చర్ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం, ప్రాబ్లెమ్ సాల్వింగ్ పోటీలో ప్రథమ స్థానం, క్విజ్‌లో ద్వితీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వీర్రాజు తెలియజేసారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు ఇ.పార్థసారధి, కె.రామరాఘవ, ఇ.హిమాంశు, రమణ, కె.హర్షితలను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా.కె.వీర్రాజు

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై నక్కపల్లి ఐవోబీ సమీపంలో గురువారం లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రమణయ్యపేటకు చెందిన కర్రి అప్పారావు బ్యాంకు పని మీద నడచి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అప్పారావు చేయి నుజ్జయింది. వెంటనే అతన్ని 108 వాహనంలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. జాతీయ రహదారి మరమ్మతు పనులు చేపట్టడం వల్ల స్టాపర్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది.



గాయపడ్డ అప్పారావు

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

నక్కపల్లి : జాతీయ రహదారిపై గొడిచర్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. రాంబిల్లి మండలం కప్పగుండుపాలెం గ్రామానికి చెందిన బద్ది శ్రీనివాసరావు(37) ఉపాధి కోసం తూర్పుగోదావరి జిల్లా శంకవరం గ్రామానికి భార్యాపిల్లలతో కలసి వలస వెళ్లాడు. బుధవారం రాత్రి బైక్‌పై స్వగ్రామమైన గుండుపాలెం వెళ్తుండగా గొడిచర్ల సమీపంలో రోడ్డుపక్కన ఉన్న సిమెంట్ పోల్‌ను ఢీకొట్టాడు. దీంతో గాయపడ్డ అతన్ని చికిత్స కోసం 108 వాహనంలో తుని తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మరణించినట్టు ఎస్‌ఐ శిరీష తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసరావు

క్లుప్తంగా

తీరిన రైల్వే గేటు సమస్య



ఇన్నాళ్లూ మూసి ఉన్న రైల్వేగేటు

అనకాపల్లిటౌన్ : స్థానిక లక్ష్మీదేవిపేట రైల్వేగేటు సమస్య గురువారం సాయంత్రంతో తీరింది. ఈ నెల 2వ తేదీ నుంచి ట్రాక్‌పై మరమ్మతుల కారణంగా రైల్వే అధికారులు గేటు మూసివేశారు. అప్పటి నుంచి గురువారం వరకు రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రైల్వేగేటు మూసి ట్రాక్ పనులు చేస్తూ వచ్చారు. ఆ ట్రాక్ పనులు ఎట్టకేలకు పూర్తవడంతో పూర్తి స్థాయిలో గేటు ఎత్తేశారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారుల రాకపోకలకు మార్గం సుగమం అయింది.

వేతన బకాయిలు చెల్లించండి


కోన లక్ష్మణ్

అనకాపల్లి రూరల్: ఎన్టీఆర్ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ కోన లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖల మాదిరి పారిశుధ్య కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చకపోవడం వల్లే అన్యాయం జరుగుతోందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా పలు విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రైవేట్ ఏజెన్సీ సంస్థలు కార్మికులకు నెలకు రూ.16 వేలు వేతనంగా ఇవ్వట్లేదని ఆరోపించారు. వేలిముద్ర గుర్తింపు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ బొమ్మ కూడలి, రింగ్‌రోడ్డు, పెరుగుబజారు కూడలి, చిన్నవీధి, నెయ్యిలవీధి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని గుర్తించి, వినియోగదారులు తమకు సహకరించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 8,644 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,200
మొదటి రకం	3,300	3,670
రెండో రకం	3,060	3,480
మూడో రకం	2,950	3,080

అనకాపల్లి సినిమాలు

పాప్‌కార్న్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
వేద	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్(ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు(ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 111 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు , బీ పాజిటివ్-56 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 381 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 509 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలు..
పేదల బతుకుల్లో వెలుగులు

- మారేడుపూడి, గొలగాం గ్రామాల్లో 150 గృహాలు
- ఇప్పటికే 30 గృహాల్లో లబ్ధిదారుల నివాసం
- ఉగాది నాటికి పూర్తి చేయడమే లక్ష్యం


జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్


మారేడుపూడి గ్రామంలో పూర్తయిన జగనన్న ఇళ్లు

అనకాపల్లిటౌన్ : మండలంలోని మారేడుపూడి, గొలగాం గ్రామాల్లో జగనన్న గృహ లబ్దిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ రెండు గ్రామాల్లో 150 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 30 గృహాల్లో పాలుపొంగించి, లబ్ధిదారులు నివాసముంటున్నారు. చాలా వరకు గృహనిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. మిగిలిన వారు కూడా వీలైనంత వేగంగా తమ శాశ్వత నివాసాలుగా జగనన్న కాలనీలను మార్చుకోవడానికి ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పన

జగన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే కాలనీలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. గృహ వినియోగదారులందరికీ మీటర్లు బిగించి, విద్యుత్ సదుపాయం అందించే దిశగా హౌసింగ్, విద్యుత్‌శాఖ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలనీలకు అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేశారు. అంతేకాకుండా మంచినీటి కుళాయిలు కూడా ఏర్పాటు చేశారు. కనీస వసతులు ఒక్కొక్కటిగా పూర్తవుతుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు, కాలువలకు ప్రతిపాదనలు

నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల నివాసానికి వీలుగా విద్యుత్, నీటి సదుపాయం ఏర్పాటు చేశారు. అయితే రోడ్లు, కాలువల నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి స్థానిక ఎంపీపీ గొర్లి సూరిబాబు తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి రోడ్లు, కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న ఉగాది నాటికి మిగిలిన గృహాలన కూడా పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించాలని మంత్రి అమర్‌నాథ్ ఆకాంక్ష. ఆ దిశగా నిధుల మంజూరుకు కృషి చేయడంతోపాటు, సంబంధిత అధికారుల్ని పరుగులు పెట్టిస్తున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మేము, మా పిల్లలు, వారి పిల్లలు కూడా రుణపడి ఉంటాం. ఎన్నో ప్రభుత్వాలను చూశాం. ఇటువంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదు. పేదోడికి ఏం కావాలో ఆయనకు అంతా తెలుసు. సొంతిల్లు లేనివారి కష్టాలు చూసే.. మా బతుకుల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రిగా ఆయన వచ్చారు. మా కలను నెరవేర్చారు. – **పి.అప్పలనర్స, మారేడుపూడి**

పేదల పక్షపాతి జగన్



సీఎం జగన్ పేదల పక్షపాతి. ఆయన ప్రజాసంకల్పయాత్రలో ప్రజలతో మమేకమై వారికి ఏం కావాలో ముందే తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే నవరత్న పథకాల్లో పేదోడికి సొంతిల్లును చేర్చి పేదల పక్షపాతి అనిపించుకున్నారు. ఆయనకు అన్నివర్గాలు ప్రజలు రుణపడిపోయారు. సీఎంగా జగన్ ఉన్నన్నాళ్లూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఢోకాలేదు.
– **ఎ.అప్పలనాయుడు, గొలగాం**

ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి

ఉగాది నాటికి జగనన్న గృహ నిర్మానాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మార్చి నెలాఖరు నాటికి మిగిలిన 120 గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తాం. ఇళ్లల్లో నివాసముంటున్న వారికి విద్యుత్ సదుపాయం కల్పించాం. రోడ్లు, కాలువల నిర్మాణాలపై నివేదిక తయారు చేస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో మంత్రి అమర్‌నాథ్‌కు నివేదిస్తాం.
– **ఎం.ధనుంజయ్, ఏఈ, జిల్లా గృహనిర్మాణ శాఖ**

రాజకీయంగా ఎదుర్కోలేకే మంత్రిపై ఆరోపణలు

- విసన్నపేట భూములపై జనసేన ఆరోపణలు అవాస్తవం
- మీడియాతో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకే టీడీపీ, జనసేన పార్టీలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక విజయా రెసిడెన్సీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్సన్నపేట భూ వివాదంలో ఆర్టీఏ ద్వారా తీసుకున్న సమాచారం గుర్తు లేదా అని ప్రశ్నించారు. విస్సన్నపేట భూములకు సంబంధించి బ్రిటీష్ కాలంలో అప్పటి డాక్యుమెంట్లలో 350 మంది రైతులుండగా ప్రస్తుతం 80 మంది సాగులో ఉన్నారని గుర్తు చేశారు. జనసేన నిజనిర్ధారణ కమిటీలతో మరోసారి ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆ భూములు అప్పటి రాజులు, కాపులు, ఇతరులకు సంబంధించినవన్నారు. పక్కజిల్లాల నుంచి జనసేన నేతలు కశింకోట మండలం విస్సన్నపేట గ్రామానికి వచ్చి నిరసనలకు దిగడం సిగ్గుచేటన్నారు. జనసేన నేతలు కోన తాతారావు, శివశంకర్‌లు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

కశింకోట జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ మండలంలోని బయ్యవరం రెవెన్యూ పరిధిలో 50 ఏళ్ల క్రితం 609 ఎకరాల్లో అప్పటి రాజులు సాగు చేసేవారని, అనకాపల్లి రిజిస్ట్రార్ కార్యాలయం రాజులపేరుపై ఉండేదన్నారు. అప్పటి రాజులు ఎక్కడెక్కడో నివసిస్తూ వారి అవసరాల నిమిత్తం భూములు అమ్ముకున్నారని వెల్లడించారు. మూడు తరాల రాజకీయ చరిత్ర కలిగిన గుడివాడ అమర్‌నాథ్ కుటుంబంపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, కశింకోట మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మార్కెట్ మాజీ చైర్మన్ మలసాల కిశోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై జనసేన నిరసన

కశింకోట : మండలంలోని విసన్నపేట గ్రామం వద్ద ఉన్న భారీ లేఅవుట్‌లో 130 ఎకరాల మేర ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిపై సర్వే జరిపించి, గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి విసన్నపేట లేఅవుట్లో భూముల్ని సందర్శించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి పరచూరి భాస్కరరావు మాట్లాడుతూ ఇక్కడి మూడు సర్వే నెంబర్లలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి, కొండలు, వాగులు, కాలువలపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సర్వే జరిపించాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే కోర్టునాశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తమ బినామీల పేర్లతో కబ్జా చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి తమ వద్ద రికార్డుల పరంగా పూర్తి ఆధారాలున్నాయని పేర్కొన్నారు. తమ ఆరోపణలు వాస్తవమేనని నిరూపించడానికి ఆధారాలతో సహా తాము సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి



నిరసనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పరవాడ: పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సినిమా హాలు కూడలిలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, చిన్న తరహా పరిశ్రమల్లో సుమారు 34 వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి ఎటువంటి ప్రమాదాలు జరిగినా, అనారోగ్యానికి గురైనా దూరంలో ఉన్న విశాఖకు వెళ్లి వైద్యం పొందాల్సి వస్తుందన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులను విశాఖకు తరలించే లోపే మరణిస్తున్నారన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కన్నూరు నాయుడు, డొకల జగన్, నాయుడు, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌లను సద్వినియోగం చేసుకోవాలి


ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీవో మంజులా వాణి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆధార్ కార్డులో చేసుకోవాల్సిన మార్పులను ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో చేయించుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి మంజులవాణి అన్నారు. అచ్యుతాపురం మండలంలో కైట్స్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేలిముద్రలు, ఫోన్ నంబర్, చిరునామా మార్పు సవరించుకోవాలని ఆమె సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వినీత పాల్గొన్నారు.

అమల్లోకి ఎలక్షన్ కోడ్

కశింకోట : ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో గురువారం నుంచి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి(కోడ్) అమలులోకి వచ్చిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. దీంతో గ్రామాల్లో రాజకీయ ప్రజా ప్రతినిధుల ఫ్లెక్సీలను, బేనర్లను తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలకు ముసుగులు వేయాలని సిబ్బంది సూచించారు. ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టరాదని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అసకపల్లి సర్పంచ్‌పై కేసు నమోదు

సబ్బవరం: ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారుల విధులను ఆటంకపరచడమే కాకుండా, వారిపై రాళ్లు రువ్వి వివాదాలకు దిగిన అసకపల్లి సర్పంచ్ కర్రి నరిసింగరావుపై కేసు నమోదైనట్లు తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఎర్రవానిపాలెంలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన ఆర్ఐ, వీఆర్వోతో పాటు ఇతర సిబ్బందిపై సర్పంచ్ వివాదానికి దిగి, దాడి చేశారని తెలిపారు. సర్వే నంబర్ 16లోని ఎర్రవాని చెరువులో అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అనేకసార్లు హెచ్చరించినా, పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. రెవెన్యూ అధికారులపై దాడి నేపథ్యంలో సెక్షన్-353, సెక్షన్-509, ఐపీసీ 34 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవోలకు తెలియజేశామన్నారు.

'పంటల్లో జన్యుమార్పిడి వద్దు'

తుమ్మపాల : ఆహార పంటల్లో జన్యుమార్పిడి టెక్నాలజీని నిషేధించాలని రైతు స్వరాజ్య వేదిక, ఏపీ రైతు సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటరమణను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. పంటల్లో జన్యుమార్పిడిని ప్రవేశపెట్టకుండా ఆపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతుసంఘం నాయకులు ఎ.బాలకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా పెంటయ్య

అనకాపల్లిటౌన్ : జిల్లా క్షయ నివారణ ఉద్యోగుల సంస్థ అధ్యక్షునిగా ఎం.పెంటయ్య ఎన్నికయ్యారు. నూతనకార్యవర్గం ఎన్నిక జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం జరిగింది. కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బీవీఎస్ పద్మజ, ఉపాధ్యక్షునిగా పీఏవీ చక్రవర్తి, కోశాధికారిగా ఎస్.సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా కేఈఏ రాయ్, మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బడ్జెట్‌తో వ్యవసాయానికి ఉరి


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అనకాపల్లిటౌన్ : మోదీ తెచ్చిన బడ్జెట్‌తో వ్యవసాయ రంగానికి ఉరి వేశారని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ ఆరోపించారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రైతు వ్యతిరేక బడ్జెట్‌పై రైతు సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో మార్పుచేసి రైతులకు, కూలీలకు, వ్యవసాయరంగానికి అనకూలంగా తీర్చిదిద్దాలన్నారు. కంపెనీలకు మాత్రం మోదీ బడ్జెట్ సిరుల పంట పండిస్తోందని ఎద్దేవా చేశారు. జిల్లా కన్వీనర్ పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని రద్దు చేయాలని బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. కూలీలు ఉద్యమించడంతో వెనక్కితగ్గి ఈ బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లతో నిధుల్లో కోత విధించడం అన్యాయమన్నారు. సంఘ నాయకులు కోరిబిల్లి శంకరరావు, వైఎస్ భద్ర, భీశెట్టి కృష్ణ అప్పారావులు మాట్లాడుతూ రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను అందరూ తిరస్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కిసాన్ కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, కొండలరావు, ఆప్‌నేత కొణతాల హరనాథబాబులు మాట్లాడుతూ ఈ బడ్జెట్ ఆమోదిస్తే దేశంలో ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు మరింతగా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక నాయకులు బాలు గాడి, రైతుసంఘ నాయకులు ఏడుకొండలు, కాళ్ల తేలయ్యబాబు, బాలాజీ, సీఐటీయూ నాయకులు చలపతి పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రాధాన్యతా భవనాలు


అచ్చెర్లలో ప్రాధాన్యతా భవనాల ప్రగతిపై సమీక్షిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : ప్రాధాన్యతా భవనాలను త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు ఆదేశించారు. మండలంలోని అచ్చెర్ల సచివాలయం పరిధిలో ప్రాధాన్యతా భవనాల ప్రగతిపై గురువారం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అలాగే మోసయ్యపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో చేపట్టనున్న కాలువ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అభయాంజనేయుని సంబరం


ఏఎస్ పేటలో అభయాంజనేయస్వామి తీర్థానికి హాజరైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్


కాళికామాత, శక్తి స్వరూపిణిల అవతారంలో నృత్య ప్రదర్శన

కశింకోట : మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు ఆంజనేయ స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి గుడివాడ హిమగౌరీ, తల్లి నాగమణి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, డైరెక్టర్ శరగడం శంకరరావు, ఎంపీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి తదితరులు తీర్థ మహోత్సవానికి హాజరై, స్వామిని దర్శించుకున్నారు. వీరికి డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ సాదర స్వాగతం పలికారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని చింతలపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన నాలుగు మహిళా బృందాలతో ప్రదర్శించిన కోలాటాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. అలాగే కాళికామాత, ఇతర శక్తి రూపాల్లో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలు రంగుల రాట్నంపై తిరుగాడారు. జారుడు బల్లలపై ఆటలాడారు. తీర్థంలో ఆట వస్తువులు, వంటింటి సామాన్లు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. డాన్స్ బేబీ డాన్స్, రేలారే రేలా తదితర సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణతో రోడ్లు తళుకులీనాయి. భారీగా బాణసంచా కాల్చి, యువత సందడి చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు


దుకాణంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

అనకాపల్లిటౌన్ : మండలంలోని తుమ్మపాల వద్ద గురువారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. చోడవరం నుంచి అనకాపల్లి వస్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ షాపులోకి దూసుకుపోయింది. చుట్టుపక్కలున్న జనాలు కాసేపు కంగారు పడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. దీంతో సమీపంలో ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

పరవాడ: సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. పరవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ధైర్యంగా తిరగగలుగుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సచివాలయ వ్యవస్థతో పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము వెళుతున్న క్రమంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నాయుడుపాలెంలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా రూ.17.29 కోట్ల మంజూరు చేశామన్నారు. రూ.4.71 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. మెరుగైన వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు వాగ్దానాలను ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు చల్లా కనకరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన


పోస్టల్ ఖాతా పథకాల గురించి వివరిస్తున్న ప్రసాద్

అచ్యుతాపురం (అనకాపల్లి): ఆడపిల్లల బంగారు భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి ఖాతా దోహదపడుతుందని అనకాపల్లి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనపాల ప్రసాద్ బాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక అచ్యుత ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పోస్టల్ ఖాతా, పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లె శేషగిరిరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, దుప్పుతూరు పోస్ట్‌మాస్టర్ విశ్వేశ్వరరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.